## క్లుప్తంగా

### విత్తనాల ఎంపికలో జాగ్రత్త

మండల వ్యవసాయాధికారి అరుణకుమారి



మేడిగడ్డతండాలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆమనగల్లు: విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి అరుణకుమారి సూచించారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డతండా, శంకరకొండ తండా, గౌరారంలో శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సులు నిర్వహించారు. పంటలసాగు, విత్తనాల ఎంపిక, సేంద్రియ ఎరువుల వాడకం, పచ్చిరొట్ట ఎరువులు, వేసవి దుక్కులు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓలు రాణి, సాయిరాం, రైతులు.. శంకర్, కృష్ణ, పరమేశ్, వెంకటయ్య పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే పరామర్శ

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీకాంత్ కాలనీకి చెందిన కాంగ్రెస్ నేత వెంకటేశ్ తల్లి పుష్పలత శుక్రవారం ఉదయం మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పుష్పలత మృతదేహానికి నివాళులర్పించారు. వెంకటేశ్‌ను పరామర్శించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


### ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోండి: ఎస్ఎఫ్ఐ

ఇబ్రహీంపట్నం: గుర్తింపు లేని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఇబ్రహీంపట్నం డివిజన్ కార్యదర్శి తరంగ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలో ఆయన మాట్లాడుతూ..అడ్మిషన్ల పేరిట విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయల ఫీజులను వసూలు చేస్తున్న గుర్తింపులేని పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు కఠినంగా వ్యవహరించాలన్నారు. విద్యాహక్కు చట్ట ప్రకారం ఫీజులు వసూలు చేయాల్సిందిపోయి ప్రైవేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. యూనిఫామ్స్, బుక్స్, షూస్, టై, బెల్ట్ తదితర వాటిని పాఠశాలల్లో అమ్మడం నేరమైనప్పటికీ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. విద్యాశాఖ అధికారులు స్పందించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

### ముంపు బాధితులను ఇబ్బంది పెట్టొద్దు: బీఆర్ఎస్

పహాడీషరీఫ్: బురాన్‌ఖాన్ చెరువు ముంపు బాధితులను ఇబ్బందులకు గురి చేస్తే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనచేపడతామనిఆపార్టీ జల్‌పల్లి మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫొద్దీన్ హామెద్ హెచ్చరించారు. నాలుగు రోజుల క్రితం ఉస్మాన్‌నగర్ చెరువు ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ పర్యటించిన అనంతరం మున్సిపాలిటీ సిబ్బంది రెండు రోజులుగా ముంపు ప్రాంతంలోని ఇళ్లకు మార్కింగ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం షర్ఫొద్దీన్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యేకు సమాచారం లేకుండా అధికారులు మార్కింగ్ ఎలా చేస్తారని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలోనే అప్పటి మంత్రి సబితారెడ్డి విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి చెరువు నుంచి నీరు వెళ్లేందుకు తూమ్ నుంచి సాల్టై బామ్ బావి వరకు పైప్‌లైన్ వేయించారన్నారు. ఇళ్లకు అడ్డంగా భారీ కట్టను కూడా నిర్మించారని గుర్తు చేశారు. ప్రస్తుతం ముంపు బాధితులు ఎలాంటి పుకార్లు నమ్మరాదని,అధికారులువచ్చిఇబ్బందులకు గురి చేస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేసుకుంటున్న సీనియర్ సిటిజన్లు

మన్సూరాబాద్: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్, గడ్డిఅన్నారం ఆధ్వర్యంలో ప్రగతినగర్‌కాలనీలోని ఆదర్శ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జీపీ ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 61మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు డాక్టర్ క్రిస్ ఆంటోనీ, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ కార్తేశ్వరీ, అసోసియేషన్ అధ్యక్షుడు వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి బ్రహ్మారెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# మురుగుతో పరేషాన్

- అనాజ్‌పూర్‌లో మురుగుమయమైన సాగునీటి కాలువ
- ఇళ్లలోని డ్రైనేజీ నీరు కాలువలోకి వదులుతున్న వైనం
- దుర్వాసనతో రోగాలబారిన పడుతున్న స్థానికులు



మురుగు, చెత్తతో నిండిన వరద కాలువ

అబ్దుల్లాపూర్‌మెట్: మండలం పరిధిలోని అనాజ్‌పూర్‌లో కొన్నేళ్లుగా మురుగునీటి సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. గ్రామంలోని ఇళ్ల మధ్య గుండా వెళ్తున్న వరద నీటి కాలువ కాస్త ఇళ్లలోంచి వచ్చే మురికినీటితో నిండిపోయి మురుగు కాలువగా తయారైంది. దీనికి తోడు ఇదే కాలువలో చెత్త వేస్తుండటంతో మురుగు పోయేందుకు దారి లేకపోవడంతో పాటు దోమలు వృద్ధి చెంది స్థానికులు రోగాలబారిన పడుతున్నారు. సాగునీటి కాలువలో మురుగు వదలడంతో విపరీతమైన దుర్గంధం వస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరదనీటి కాలువలోని వస్తున్న మురుగును మళ్లించి దానికి పైకప్పు వేయాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. గ్రామంలో అధునాతమైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వారు కోరుతున్నారు. అధికారులు స్పందించని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు.

**రోగాలబారిన పడుతున్నాం**

ప్రతీసారి ఎన్నికల సమయంలో నేతలు వచ్చి మురుగు సమస్యను పరిష్కరిస్తామంటూ హామిలిచ్చి ఎన్నికల తర్వాత విస్మరిస్తున్నారు. గత కొన్నేళ్లుగా గ్రామంలో ఇదే కొనసాగతోంది. మురుగు వలన రోగాలబారిన పడుతున్నాం. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. – సత్యనారాయణరెడ్డి, అనాజ్‌పూర్

# సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

ఆమనగల్లు: కడ్తాల మండలం సలార్‌పూర్‌కి చెందిన సాయిలు, గణేశ్‌కు కిడ్నీ మార్పిడి కోసం ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద మంజూరైన రూ.4.10 లక్షల చెక్కులను కడ్తాల జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ శుక్రవారం అందించారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో తండ్రి సాయిలు తన కొడుకు గణేశ్‌కు కిడ్నీ దానం చేయగా.. ఆపరేషన్ విజయవంతమైంది. జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ సహాయంతో వారు సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.4.10 లక్షలు మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రియా రమేశ్, నాయకులు పంతునాయక్, గోపాల్, సీతారాంనాయక్, జైపాల్, శంకర్ తదితరులు ఉన్నారు.

# నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



ఇబ్రహీంపట్నం: కరెంట్ తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మల తొలగింపు, ఏబీ స్విచ్ మరమ్మతులు కారణంగా ఇబ్రహీంపట్నం ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ పంపిణీలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మంచాల రోడ్డు, మహంకాళీనగర్, గాం, దీనగర్, శ్రీ సాయినగర్, మున్సిపల్, తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలు, ప్రభుత్వాస్పత్రి, శివాలయం, జంగాల బస్తీ, బీరప్ప టెంపుల్, బ్రిలియంట్ స్కూల్, పోచమ్మ ఆలయం, పాత బస్టాండ్, గోకుల్‌నగర్ పరిసర ప్రాంతాల పరిధిలో విద్యుత్ పంపిణీ ఉండదని తెలిపారు.

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యుత్ తీగల మరమ్మతుల నేపథ్యంలో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆదిబట్ల సబ్‌స్టేషన్ ఏఈ జయన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిబట్ల మున్సిపాలిటీలోని మంగళ్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ సీవీఆర్ కళాశాల ఫీడర్ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. సీవీఆర్ కాలేజి, భారత్ కాలేజి, రిలైసీస్ డివైసెస్, ఏవీసీవెంచర్, పోచారం, ఉప్పరిగూడఇండస్ట్రీస్, రాందాస్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని.. రాందాస్‌పల్లి, మల్శెట్టిగూడ, శేరిగూడలో విద్యుత్ సరఫరాలోఅంతరాయం ఉంటుందన్నారు.

**అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో..**

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అనాజ్‌పూర్, ఉమర్‌ఖాన్‌గూడ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ విద్యారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అనాజ్‌పూర్, పాటి, మజీద్‌పూర్, కుబేరపురి కాలనీ, గుంతపల్లి, ఉమర్‌ఖాన్‌గూడ, అవంతి కాలేజీ, కేవీకే కళాశాల పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

**మదర్‌డెయిరీ పరిధిలో..**

పెద్దఅంబర్‌పేటలోని మదర్ డెయిరీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని శివపార్వతి ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ చంద్రమౌళి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు హనుమాన్ నగర్, సన్‌రైజ్ కాలనీ, భాగ్యనగర్‌కాలనీ, వైజంక్షన్, శ్రీ సాయినగర్, భూదాన్‌కాలనీ, రాజీవ్‌గృహకల్ప, శ్రీరాంనగర్ కాలనీ, వరసిద్ధివినాయకనగర్, రేణుకాసింగపూర్, ఇందుకూరి వెంచర్ పరిసర ప్రాంతాలు... అదే విధంగా గణేష్‌నగర్ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా మధ్యాహ్నం 2.గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు సర్వేనంబర్ 99, 100, 78 కాలనీ, ఇష్టకామేశ్వరీనగర్, రత్నకాలనీ, ప్రజయ్ గుల్మోహన్, జూబ్లీనగర్, కనకదుర్గానగర్, ఆర్ఎన్ఆర్ ఫేజ్–1, పల్లవీ ఇంజనీరింగ్ కళాశాల తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ తెలిపారు. మరమ్మతుల నేపథ్యంలో వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

# పొగాకుతో మానవ మనుగడకు ప్రమాదం

**ఆమనగల్లు వైద్యాధికారి నరేందర్**



పొగాకుకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

ఆమనగల్లు: పొగాకు ఉత్పత్తులను వాడితే అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డా.పరీక్షిత్ నరేందర్ అన్నారు. పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. డా.పరీక్షిత్ నరేందర్ మాట్లాడుతూ.. పొగాకు వాడకం వల్ల నోటి సంబంధిత క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, గుండెనొప్పి తదితర సమస్యలు వస్తాయని అన్నారు. చిన్నపిల్లల్లో శ్వాసకోస సంబంధిత వ్యాధులు ఎదురవుతాయని చెప్పారు. సిగరెట్లు, గుట్కా, పాన్‌మసాలాలతో ప్రపంచ మానవాళి మనుగడకు ప్రమాదం ఉందని హెచ్చరించారు. అనంతరం పొగాకుకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు జయశ్రీ, మంజుల, సిబ్బంది.. తిరుపతిరెడ్డి, లక్ష్మి, నాగేశ్వరి, వేణు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### సామాజిక తనిఖీలపై నేడు మండల నివేదిక

ఇబ్రహీంపట్నం: గ్రామీణ ఉపాధి హామీ సామాజిక తనిఖీలపై నిర్వహించిన గ్రామసభలపై మండల నివేదికను శనివారం ఉదయం 10 గంటలకు ఇబ్రహీంపట్నంమండల పరిషత్ కార్యాలయంలో జరిగే సమావేశంలో ఆ బృందం వెల్లడిస్తుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్ శుక్రవారంతెలిపారు. ఈనెల 18వ తేదీ నుంచి 29వ తేదీ వరకు గ్రామాలవారీగా ఉపాధి పనులపై తనిఖీలు జరిపి గ్రామ సభలను సామాజిక తనిఖీ బృందం నిర్వహించింది. ఈ తనిఖీల మండల నివేదికను సంబంధిత అధికారులకు ఈ సమావేశంలో వివరిస్తారని చెప్పారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో అధికారుల సమక్షంలో ఈ సమావేశం జరుగనున్నట్లు తెలిపారు.

### సర్వసభ్య సమావేశం వాయిదా

మాడ్గుల: కోరం లేకపోవడంతో మండల సర్వసభ్య సమావేశాన్నివాయిదా వేసినట్లు ఎంపీడీఓ సరస్వతి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పద్మారెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సభకు మెజార్టీ ఎంపీటీసీలు హాజరుకాలేదు. సభ నిర్వహించడానికి కావాల్సినంతమంది రాకపోవడంతో సభను వాయిదా వేశామని.. తదుపరి సమావేశం ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని ఎంపీడీఓ తెలిపారు.

### 3న సర్వసభ్య సమావేశం

ఇబ్రహీంపట్నం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కృపేశ్ అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలు, సంబంధిత శాఖల అధికారుల హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

### కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్‌ల్లో కూరగాయల ధరలు (కిలో.. రూపాయల్లో) టమాట 27, వంకాయ 23, బెండ 38, పచ్చి మిర్చి 50, కాకర 38, బీర 35, క్యాబేజి 16, ఫ్రెంచి బీన్స్ 125, క్యారెట్ 40, దొండ 18–23, చిక్కుడు 65, పొట్ల 18, ఉల్లిగడ్డ 27, చామగడ్డ 40. గమనిక: ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమల్లో ఉంటాయి.

# ప్రభుత్వ బడులకు మహర్దశ

**ఎంపీపీ కృపేశ్**



ఎన్గల్‌గూడ బడిలో పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ కృపేశ్

ఇబ్రహీంపట్నం రూరల్: అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులతో విప్లవాత్మకమైన మార్పులు వస్తాయని ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్ పేర్కొన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం మండలంలోని పోల్కంపల్లి అనుబంధ గ్రామం ఎన్గల్‌గూడ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాలలతో ప్రభుత్వ బడుల రుపురేఖలు మారుతాయని తెలిపారు. ఇప్పటికే ప్రతి పాఠశాలకు లక్ష రూపాయల చొప్పున కేటాయించి అభివృద్ధి చేయడం జరుగిందన్నారు. గతంలో మండల పరిషత్ నిధుల నుంచి సాంకేతిక పరికరాలు, ల్యాబ్ సామగ్రి, కంప్యూటర్లు, టీవీలు అందజేశామని తెలిపారు . ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఒకే మండలంలో 24 పాఠశాలలను మొదటి విడతలో ఎంపిక చేసి వాటిని అభివృద్ధి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పోల్కంపల్లి ఎంపీటీసీ మంగ రవీందర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్, మండల ఏఈ ఇంద్రాసేనారెడ్డి, మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి, నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్‌ల తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నందివనపర్తి పాఠశాల 2000-01 బ్యాచ్ విద్యార్థులు

యాచారం: మండల పరిధిలోని నందివనపర్తి ఉన్నత పాఠశాలకు చెందిన 2000–01 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ప్రవేట్ పంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. విద్యార్థిదశ నాటి జ్ఞాపకాలు, అల్లరి చేష్టలను గుర్తుచేసుకుని సందడిగా గడిపారు. తాము చదువుకున్న నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి ఆర్థికపరంగా సహకారం అందిస్తామని తెలిపారు.

# ప్రజా సమస్యలు పట్టని కాంగ్రెస్

**బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ అనిల్**



ధర్నాకు తరలివెళ్తున్న బీజేవైఎం నాయకులు

తలకొండపల్లి: ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారిపై సీబీఐచే విచారణ జరిపించాలని బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ అనిల్ డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపు మేరకు హైదరాబాద్ ధర్నాచౌక్ వద్ద శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి అనిల్ ఆధ్వర్యంలో బీజేవైఎం నాయకులు తలకొండపల్లి నుంచి పెద్ద ఎత్తున హైదరాబాద్‌కు తరలివెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం నేతలు.. యాదీశ్, మధు, గోపాల్, మల్లికార్జున్, రాజేష్, విజయేందర్, భగీరథ తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

తలకొండపల్లి: మండల పరిధిలోని కర్కాస్ తండాకు చెందిన సబావట్ కృష్ణ నాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. స్థానిక నాయకుడు శంకర్ ద్వారా విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నేత, శతాబ్ది టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించి రూ.4000 ఆర్థిక సహాయం అందజేశారు. శంకర్ నాయక్, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**అండగా ఉంటాం..**

మండల పరిధిలోని చౌదర్‌పల్లికి చెందిన మల్లేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బీజేపీ సీనియర్ నేత తల్లోజు ఆచారి శుక్రవారం చౌదర్‌పల్లికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్, జిల్లా పబ్లిసిటీ కన్వీనర్ మహేష్, బీజేపీ ప్రధాన కార్యదర్శి పాండు ప్రసాద్, మండల అధ్యక్షుడు రవిగౌడ్, ఎంపీటీసీ హేమరాజు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

**సంకటోనిపల్లికి చెందిన..**

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ సంకటోనిపల్లికి చెందిన లాలయ్య శుక్రవారం మృతిచెందాడు. మున్సిపల్ కౌన్సిలర్ రాధమ్మ, బీఆర్ఎస్ నాయకులు వెంకటయ్య.. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.2500 సాయం అందించారు.

**తలకొండపల్లిలో..**

తలకొండపల్లి: మండల పరిధిలోని చంద్రధన గ్రామానికి చెందిన వాహెద్ (62) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.3000 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాములు, నాయకులు.. రాజేందర్‌రెడ్డి, వెంకటేశ్, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కృష్ణయ్య, శ్రీనివాస్, రఫీక్, సుల్తాన్, ముంతాజ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి
- రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

మీర్‌పేట: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల వాల్ పోస్టర్లను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి శుక్రవారం మీర్‌పేటలోని క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జూన్ 1 నుంచి 3వ తేదీ వరకు మూడు రోజుల పాటు నియోజకవర్గంలోని మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లు, డివిజన్లలో ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. జూన్ 2వ తేదీన జిల్లెలగూడ చందన చెరువు కట్టపై ముగింపు వేడుకలలో భాగంగా అమరవీరుల స్థూపం వద్ద అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు సన్మానం చేస్తామన్నారు. కలసికట్టుగా వేడుకలను విజయవంతం చేయాలన్నారు. బీఆర్ఎస్‌తోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మీర్‌పేట, బడంగ్‌పేట అధ్యక్షులు అర్కల కామేష్‌రెడ్డి, రామిడి రాంరెడ్డి, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, నాయకులు సాజీద్, గోపాల్, ప్రభాకర్, సునీత, లావణ్య, లలితజగస్, ప్రవీణ్‌రెడ్డి, బాలరాజు, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్యాంపు కార్యాలయంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- కడ్తాల సీఐ శివప్రసాద్
- వ్యవసాయాధికారులతో కలిసి ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీ
- టాస్క్‌ఫోర్స్ స్పెషల్ టీం డీటీ సంతోష్
- పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు



ఆమనగల్లు: ఎరువుల షాపులో రిజిస్టర్లను పరిశీలిస్తున్న ఎస్ఐ బల్‌రాం నాయక్, ఏఓ అరుణకుమారి

ఆమనగల్లు: నకిలీ విత్తనాలు విక్రయిస్తే సంబంధిత వ్యాపారులపై చర్యలు తప్పవని కడ్తాల సీఐ శివ ప్రసాద్ హెచ్చరించారు. కడ్తాల మండల కేంద్రంలోని పలు ఎరువుల షాపులను శుక్రవారం మండల వ్యవసాయాధికారి శ్రీలతతో కలిసి సీఐ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా షాపుల్లో ఉన్న స్టాక్, రిజిస్టర్లను వారు పరిశీలించారు. షాపుల్లో ఉన్న విత్తనాలు, ఎరువులను పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు విక్రయించినా, అధిక ధరలకు అమ్మినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. షాపులకు వచ్చే స్టాక్‌ను వెంటనే రిజిస్టర్లలో నమోదు చేయడంతో పాటు ఈ పాస్ ద్వారా మాత్రమే ఎరువులను విక్రయించాలని సూచించారు. రైతులు కొనుగోలు చేసే విత్తనాలు, ఎరువులకు సంబంధించి రసీదులను విధిగా తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్, ఏఈఓ అభినవ్, డీలర్ సుఖేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**ఆమనగల్లులో..**

ఆమనగల్లు పట్టణంలోని ఫర్టిలైజర్ షాపులను శుక్రవారం ఎస్ఐ బల్‌రాం నాయక్, వ్యవసాయాధికారి అరుణకుమారి, డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్ తనిఖీ చేశారు. ఆయా షాపుల్లో ఉన్న ఎరువులు, విత్తనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది శ్రీశైలం, డీలర్లు చంద్రశేఖర్, చంద్రమౌళి, రవి, నర్సింహారెడ్డి, జంగయ్య, రాజేశ్, భరత్‌రెడ్డి, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

**క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం**

తలకొండపల్లి: నకిలీ విత్తనాలు విక్రయించేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని టాస్క్‌ఫోర్స్ స్పెషల్ టీం డీటీ సంతోష్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మండల వ్యవసాయ అధికారి రాజుతో కలిసి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నర్సింహ ట్రేడర్స్, ఆగ్రో రైతుసేవా కేంద్రం, జై కిసాన్ సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ విత్తన దుకాణాల్లో తనిఖీ నిర్వహించారు. స్టాక్, నిల్వ తదితర రిజిస్టర్లను పరిశీలించారు. వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని డీలర్లకు సూచించారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసినప్పుడు రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీకాంత్, ఏఓ రాజు, డీటీ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.